## చిన్న కథ

# మూసుకున్న తలుపులు

డా. బోయ జంగయ్య

అది డిగ్రీ కాలేజ్ ఆవరణ. విద్యార్థిని, విద్యార్థులు అప్పుడే వస్తున్నారు. పుస్తకాలను ఎద మీదుంచుకుని గేటులోపల ప్రవేశించింది మమత. గేటుకు కాలేజి భవానికి ఓ ఫర్లాంగ్ దూరం వుంది. సరిగ్గా అప్పుడే మోటారు బైక్‌మీద వస్తున్న నాగరాజు మమతను చేరగానే స్లో చేసి, పలకరించాడు. ఇది రోజు జరుగుతున్న తతంగం. మమతకు అదో తలనొప్పిగా తయారైంది. 'ఇంట్లో చెపితే గొడవలు కావచ్చు. పోలీసులకు చెపితే కేసు నమోదు చేసి లోప వేయొచ్చు. ప్రిన్సిపాల్‌కు చెప్పితే' అనుకుంటూ ఉండగా సరళ వచ్చి కలిసింది. ఇద్దరు కలసి నడిచేది చూసి అతను ముందుకు పోయాడు. అతనిని చూపిస్తూ విషయం సరళకు చెప్పింది మమత.

"ఆc.. రెండ్రోజులు వెంట పడి వాడే ఆగిపోతడులే వొదిలేయ్" అంది.

"నీవేం సిగ్నల్ ఇవ్వలేదు కదా?" అంది తిరిగి తనే.

"సిగ్నలా పాడా"అన్నపుడు ఆమె కనుబొమ్మలు ముడిపడి విడిపోయాయి. "స్కూల్‌లో మనతోటె చదివినపుడు, మప్. ఇంటరుకొచ్చినంక కొంటె కోనంగి అయ్యిండు"

"నీవేం టెన్షన్ పడకు" అంది సరళ.

మరునాడు అదే గ్రౌండ్‌లోనే మమత వెనకబడి "నిన్న కోపమొచ్చిందా? రానీయకమ్మ. తన కోపం తన శత్రువు తెలుసుగా?" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"సూటిగా చెపుతున్న ఐలవ్‌యు" అని వెనక్కి వెళ్లిపోయాడు.

***

తలుపు తట్టిన శబ్దం విని "వస్తున్న" అంటూ వచ్చి డోర్ తీసింది ఇంటావిడ దేవకి.

ఇద్దరమ్మాయిలు ఒకేసారి నమస్కారంచెప్పి "లోపలికి రావచ్చ ఆంటీ" అన్నారు.

"రండి రండి" అంటూ తీసుకెళ్లి కూర్చోబెట్టి మంచి నీళ్లిచ్చింది.

విషయాన్ని వివరించింది సరళ.

దేవకికి నమ్మ బుద్ధి కాలేదు. కాని ఆమెకు రోజు రోజుకు వానిలో వస్తున్న మార్పులు గుర్తొచ్చి, దడ పుట్టి మగ్‌లో మిగిలిన నీళ్లను నోట్లో వంచుకుంది.

"అదీ సంగతి. వస్తం ఆంటీ" అంటూ లేచి నిలుచున్నారు.

"నేను చూసుకుంటా. మీ తెరువు రాకుండ చూస్తనమ్మ." అంటూ సాగనంపి వచ్చి కూర్చుందే కాని మనస్సంతా కొడుకు చుట్టె తిరుగుతూంది. ఇంటర్‌లో మీసాలు మొలవగానే సోకు లెక్కువయ్యాయి. బట్టల ఇస్త్రీ నలగనీయకపోవడం, కాలేజికి వెళ్లే ముందు అద్దం దగ్గర అరగంట గడపడం. మోటార్ బైక్ కోసం తండ్రితో తగాద పడడం, 'ఇల్లు కాలేజీయేనా.. లైబ్రరీ ఉండదా? ఫ్రెండ్స్ వుండరా? మీరిచ్చె డబ్బులను ఖర్చు చేయొద్దా?' లాంటి వెటకారపు మాటలు.

***

దేవకి ఇంట్లో ఫోన్ మోగగానే ఎత్తి "హల్లో" అంది.

"నేను మమతను ఆంటీ. మొన్న నా స్నేహితురాలు నేను వచ్చినం.. ఇదిగో నా సెల్ స్పీకర్ ఆన్ చేసిన వినండి" అంది.



దేవకి వింటూ ఉంది. పరిచయమున్న గొంతే.

"నేను ఐలవ్‌యు చెప్పాను. నీవు ఇంత వరకు చెప్పలేదు. నాలుగు గంటల దాకా చూసి ఫోన్లు చేస్తున్న. ఇప్పుడైనా చెపుతావా లేదా?" అవతలి గొంతు.

మమత మాట్లాడలేదు.

రెచ్చిపోయిన అవతలి గొంతు "ఇక నీ పని చెపుత. వరంగల్ సంగతి తెలుసగ" సెల్ ఆఫైంది.

దేవకి విస్తుపోతు నిలుచుండి పోయింది. గుండె దడ పెరిగింది.

"అది వరస ఆంటి. నేను ఎన్నడు మాట్లాడిందాన్ని కాదు. అయినా ఒన్ సైడెడ్‌గా ఆయన అట్లావుంటే ఎట్లా? మీరె చెప్పండి" అంది మమత.

"నేను చూస్తలే మమత" అంది.

"చూస్త అంటె ఎట్ల ఆంటి"

"సరె.. అదుపు చేస్తగా. నీవె చూస్తవు" అంటూ ఫోన్ పెట్టేసింది దేవకి.

నాగరాజు ఇంటికొచ్చి నీటుగా తయారై మళ్లీ బయటికి వెళ్లడానికి సిద్ధమౌతున్నాడు.

"రాజు బజారుకా. ఇదిగో. ఈ వంద తీసుకుని, ఇంకో యాసిడ్ బాటిల్ కొనుక్కురా"అంది.

రాజుకు మాట రాలేదు.

"ఎలాగో వోటి కొంటున్నవుగదా. ఇంకోటి కొంటె, రెండవది మొదట నాముఖం మీద పోస్తె మొదటిది నిన్ను ప్రేమించని అమ్మాయి మీద పోయొచ్చు." అంది కొంగుతో చేతులు తుడ్చుకుంటూ. అప్పుడు ఆమె పెదవులు వణకుతున్నాయి.

రాజుకు గోడమీది బొమ్మకు తేడా లేని క్షణమది!

"నీతోడ ఆడపిల్లలు లేరు. వేరే ఆడపిల్లను తోబుట్టువులాగ చూడాలి. తరువాత నీకోసం ప్రత్యేకంగా ఎంపిక చేసిన అమ్మాయిని మాత్రమె, ప్రియురాలుగ, భార్యగ చూడాలి. అంతెగాని కనపడ్డ ఆడపిల్లలందర్ని ప్రియురాళ్లు అనుకోవడం వాళ్లా నిన్ను అట్టాగె చూడాలనుకోవడం తప్పని తెలియని వయస్సా నీది. చదువుతో పాటు సంస్కారం ముఖ్యం సుమా" అంది. ఈసారి మాత్రం ఆమె గొంతు కఠినంగా ఉంది.

"గాలి తిరుగుళ్లు తిరుగుతు వంశ మర్యాదలను మంటల కల్పకు. నా పాలు తాగి పెరిగిన వాడివైతె నీలోని రాక్షసత్వం తొలగి మానవత్వం చోటు చేసుకోవాలి. నీకెంతో జీవితం వుంది. ఆలోచించుకో. నీ పేరులోని నాగును తొలగించుకుని రాజులాగ బతుకు" అని కొడుకును హెచ్చరించింది దేవకి.

బయటికి వెళ్లబోయిన రాజు వెనక్కు మళ్లీ తన గదిలోకి నడిచి తలుపేసుకున్నాడు.

★